# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-05-2025 సమయం : రాత్రి 9 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ వేదికపై భారతదేశం యొక్క సృజనాత్మక శక్తిని వేవ్స్ సదస్సు ఆవిష్కరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.
- పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో సరిహద్దు భద్రతా దళం BSF ఈరోజు ఉగ్రవాద కుట్రను భగ్నం చేసింది.
- కుల గణన చేపట్టాలనే నిర్ణయం సామాజిక న్యాయం పట్ల ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.
- ఏప్రిల్ నెలకు సంబంధించి రికార్డు స్థాయిలో 2.37 లక్షల కోట్ల రూపాయల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటలో భాగంగా కొద్ది సేపటి క్రితం కేరళ చేరుకున్నారు.

========================

ప్రపంచ వేదికపై భారతదేశం యొక్క సృజనాత్మక శక్తిని “వేవ్స్” సదస్సు ఆవిష్కరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ సృజనాత్మకతకు నాయకత్వం వహించడానికి భారతదేశానికి ఇదే సరైన సమయమని అన్నారు. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈరోజు వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) 2025ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అనంతరం ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి కృషి చేస్తోందని, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టమ్ ఇక్కడ ఉందని అన్నారు. భారతీయ చిత్రాలు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందుతున్నాయని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ వేవ్స్ సదస్సు నూతన ఆర్థిక అవకాశాలను సృష్టిస్తుందని అన్నారు. ఈ సదస్సు సృష్టికర్తలకు ప్రపంచ వేదికను అందిస్తుందని, కొత్త టెక్నాలజీని పరిచయం చేస్తుందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వేవ్స్ సదస్సులో భాగంగా ఈరోజు వివిధ ప్లీనరీ సెషన్‌లను నిర్వహించారు. నటుడు అక్షయ్ కుమార్ వ్యాఖ్యాతగా నిలిచిన "లెజెండ్స్ & లెగసీస్: ది స్టోరీస్ దట్ షేప్డ్ ఇండియాస్ సోల్" అనే సెషన్ లో చలన చిత్రా ప్రముఖులు హేమ మాలిని, మోహన్‌లాల్, చిరంజీవి, రజనీ కాంత్, మిథున్ చక్రవర్తి పాల్గొన్నారు. వినోద రంగంలోనూ, క్రీడా రంగంలో భారతదేశానికి అపారమైన సామర్థ్యం ఉందని అంతర్జాతీయ స్థాయిలో మనల్ని మనం ప్రదర్శించుకోవడానికి వేవ్స్ శిఖరాగ్ర సమావేశం సరైన వేదికని నటుడు చిరంజీవి పేర్కొంటూ...

(వాయిస్ 19 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్‌లోని అమృత్ సర్‌లో ఆయుధాలు, గ్రెనేడ్‌లను స్వాధీనం చేసుకోవడం ద్వారా సరిహద్దు భద్రతా దళం BSF ఉగ్రవాద కుట్రను భగ్నం చేసింది. BSF ఇంటెలిజెన్స్ విభాగానికి అందిన సమాచారం మేరకు, నిన్న సాయంత్రం భరోపాల్ గ్రామ సమీపంలో సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. దీని ఫలితంగా రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లు, మూడు పిస్టల్స్, ఆరు మ్యాగజైన్‌లు, 50 లైవ్ రౌండ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలను మందుగుండు సామగ్రిని పోలీసులకు అప్పగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటనలో భాగంగా కొద్ది సేపటి క్రితం కేరళ చేరుకున్నారు. భారతదేశంలో మొట్టమొదటి సెమీ ఆటోమేటెడ్ పోర్ట్ అయిన "విజింజం అంతర్జాతీయ ఓడరేవు"ను ప్రధానమంత్రి రేపు జాతికి అంకితం చేయనున్నారు. తిరువనంతపురంలోని విజింజం ఓడరేవును రేపు అధికారికంగా ప్రారంభిస్తారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. అమరావతిలో 58 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 7 జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ, హైకోర్టు, సచివాలయం, ఇతర పరిపాలనా భవనాలు వంటి బహుళ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే విశాఖపట్నంలోని మధురవాడలో పిఎం ఏక్తా మాల్ కు ప్రధానమంత్రి నరేంద్రమోడీ శంకుస్థాపన చేస్తారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కుల గణన నిర్వహించాలనే నిర్ణయం సామాజిక న్యాయం పట్ల ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నిర్ణయం అకస్మాత్తుగా తీసుకోలేదని, ప్రభుత్వం ఆలోచించి, ఉద్దేశపూర్వకంగా తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. జాతీయ జనాభా గణనను మొదట 2021కి షెడ్యూల్ చేశామని, కానీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఇప్పుడు రాబోయే జనాభా గణనలో కుల గణనను చేర్చాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు. హోంమంత్రి అమిత్ షా దాదాపు ఏడాది క్రితమే దీని గురించి సూచించారని ఆయన వెల్లడిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏప్రిల్ నెలకు సంబంధించి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు రికార్డు స్థాయిలో 2.37 లక్షల కోట్ల రూపాయలు నమోదయ్యాయని కేంద్రప్రభుత్వం ఈరోజు వెల్లడించింది. గతేడాది ఏప్రిల్ నెలలో ఈ మొత్తం 2.10 లక్షల కోట్ల రూపాయలుగా ఉండగా ఈ సంవత్సరం జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరిగాయి. అంతకు ముందు మార్చిలో జీఎస్టీ వసూళ్లు 1.96 లక్షల కోట్లుగా నమోదవగా.. ఏప్రిల్ నెల మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా 1.9 లక్షల కోట్ల రూపాయల వసూళ్లు జరిగాయి. 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా 2025 ఏప్రిల్ నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాకిస్తాన్ విమానయాన సంస్థలకు భారతదేశం తన గగనతలాన్ని మూసివేసింది. ఈ గగనతల మూసివేత మే 23వ తేదీ వరకు అమలులో ఉంటుంది. పాకిస్తాన్‌లో రిజిస్టర్ చేయబడిన విమానాలు, పాకిస్తాన్ విమానయాన సంస్థలు నడుపుతున్న విమానాలు, సైనిక విమానాలతో సహా ఆపరేటర్లకు భారత గగనతలం అందుబాటులో లేదని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో టే-యుల్ తో ఈరోజు ఉదయం ఫోన్ లో మాట్లాడారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి గురించి చర్చించారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ ఎదుర్కోవాల్సిన అవసరాన్ని జైశంకర్ ప్రస్తావించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కొరియా రిపబ్లిక్ సంఘీభావానికి ఆయన చో టే-యుల్ కు కృతజ్ఞతలు తెలిపారు. అంతకముందు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతోనూ జైశంకర్ మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిని, వారికి మద్దతు ఇచ్చిన వారిని చట్టం ముందు దోషులుగా నిలబెట్టాలని జైశంకర్ పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ఉగ్రవాదులు జరిపిన దాడిపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇలాంటి వ్యాజ్యాలతో మన దేశ భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారాని సుప్రీం కోర్టు పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దని, ఉగ్రవాద ఘటనల విచారణకు న్యాయమూర్తులు నిపుణులు కారని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థుల కోసమే అయితే హై కోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. న్యాయస్థానం సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గామ్ ఉగ్రవాద దాడిలో పాల్గొన్న ఎవరినీ భారత్ విడిచిపెట్టదని హోంమంత్రి అమిత్ షా ఈరోజు అన్నారు. బోడో నాయకుడు బోడోఫా ఉపేంద్రనాథ్ బ్రహ్మ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఈరోజు ఆవిష్కరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =